# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 05-04-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **దేశ వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించడంలో మాజీ ఉప ప్రధానమంత్రి బాబూ జగజ్జీవన్ రామ్ కీలక పాత్ర పోషించారని రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

2. **అమరావతి ప్రాంతంలో 57 వేల 821 కోట్ల రూపాయల మేర నిర్మాణ పనులు వివిధ దశలలో జరుగుతున్నాయని పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు.**

3. **రాయలసీమలో ఉద్యానవన పంటల అభివృద్ధికి 40 వేల కోట్ల రూపాయలను కేటాయించామని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు.**

4. **జాతీయ సముద్రయాన దినోత్సవం** -National Maritime Day“ **ను ఈ రోజు జరుపుకుంటున్నాం.**

==========================

మాజీ ఉప ప్రధానమంత్రి బాబు జగజీవన్ రామ్ 119వ జయంతి సందర్భంగా రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ నివాళులర్పించారు. విజయవాడలోని లోక్‌భవన్‌లో ఈ రోజు జరిగిన కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ సమాజంలోని అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడారని అన్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతుల వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా జగ్జీవన్ రామ్ హరిత విప్లవానికి నాంది పలికారని, దీని ద్వారా దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని గవర్నర్ తెలిపారు.

గుంటూరు జిల్లా ఉండవల్లి లోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన బాబూ జగజ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జగజ్జీవన్ రామ్ అందించిన సేవల్ని ముఖ్యమంత్రి కొనియాడారు. పారిశ్రామిక చట్టం, కనీస వేతనాలు, భవిష్య నిధి లాంటి ఎన్నో సంస్కరణలు అమలు చేశారని పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తితోనే ఎస్సీల్లోని అన్ని కులాలకూ సమాన అవకాశాలు లభించేలా వర్గీకరణ చేశామని తెలిపారు. అన్ని వర్గాలకు సామాజిక న్యాయం జరగాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

-------------------------

భారత పార్లమెంటరీ వ్యవస్థలో ఉప ప్రధానమంత్రిగా, సుదీర్ఘకాలం పాటు వివిధ శాఖలలో మంత్రిగా

బాబూ జగ్జీవన్ రామ్ అందించిన సేవలు చిరస్మరణీయమని బాపట్ల పార్లమెంటు సభ్యులు తెన్నేటి కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. బాబూ జగ్జీవన్ రామ్ 119వ జయంతిని పురస్కరించుకుని ఒంగోలులోని నెల్లూరు బస్టాండ్ సెంటర్ లోని ఆయన విగ్రహానికి ఈ రోజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, బలహీన వర్గాల సంక్షేమం కోసం ఆయన ఎంతో కృషి చేశారని తెలిపారు. స్వాతంత్ర్య పోరాటంతో పాటు భారతదేశ నిర్మాణంలో వ్యవసాయ, రక్షణ శాఖల మంత్రిగా నే కాక ఉప ప్రధానమంత్రిగా కూడా నిర్మాణాత్మక పాత్ర పోషించారని తెలియజేస్తూ,

వాయిస్ 26 సెకన్లు

---------------------------

అమరావతి ప్రాంతంలో ప్రస్తుతం 57 వేల 821 కోట్ల రూపాయల మేర నిర్మాణ పనులు వివిధ దశలలో జరుగుతున్నాయని పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. అమరావతి నిర్మాణ పనుల పురోగతిపై నిర్మాణ సంస్థలు, సంబంధిత అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమరావతి అభివృద్ధిని నిర్మాణ సంస్థలు కేవలం ఒక కాంట్రాక్టుగా కాకుండా, బాధ్యతగా చూడాలన్నారు. అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. అలాగే మానవ వనరులు, యంత్రాలు, హరిత ఇంధనం, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని మంత్రి నారాయణ సూచించారు.

---------------------------

రాయలసీమలో ఉద్యానవన పంటల అభివృద్ధికి 40 వేల కోట్ల రూపాయలను కేటాయించామని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. నంద్యాల కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన "బడ్జెట్ అవుట్‌రీచ్" కార్యక్రమంలో మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ... ఫరూక్ తో కలిసి ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ, ఆర్థిక క్రమశిక్షణ, ఆదాయ వనరుల పెంపు ద్వారా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని అన్నారు బడ్జెట్ అవుట్‌రీచ్ కార్యక్రమాల ద్వారా రాష్ట్ర బడ్జెట్ లో జిల్లాలకు ఏ విధంగా కేటాయింపులు చేశామనే అంశాలపై అవగాహన కల్పిస్తున్నామని మంత్రి తెలుపుతూ,

వాయిస్ 28 సెకన్లు

---------------------------

సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం నియోజకవర్గం ధవళేశ్వరం సమీపంలోని సమాధుల తోట వద్ద నిర్వహించిన ఈస్టర్ సేవా కార్యక్రమంలో మంత్రి ఈ రోజు పాల్గొని రొట్టెలు, మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరంకందుల దుర్గేష్ మాట్లాడుతూ, క్రీస్తు పునరుత్థాన పర్వదినమైన ఈస్టర్ ప్రేమ, క్షమ, త్యాగం అనే విలువలను గుర్తుచేస్తుందని తెలిపారు. సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం, అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడం ద్వారా మానవతా విలువలు పెంపొందుతాయని మంత్రి వివరించారు.

---------------------------

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఈ రోజు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, ఒంటిమిట్టలో

సీతారామకళ్యాణాన్ని ప్రభుత్వం విజయవంతంగా నిర్వహించిందన్నారు. తిరుమలలో టిటిడి పాలకమండలి ఎన్నో మార్పులు తీసుకొచ్చిందని.. ప్రసాదాలలో నాణ్యత పెరిగిందని మంత్రి తెలుపుతూ,

వాయిస్ 26 సెకన్లు

---------------------------

పార్వతీపురం మన్యం జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరచడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి వెల్లడించారు. జిల్లాలోని డోలీ రహదారి ప్రాంతాలపై సంబంధిత అధికారులతో దృశ్యమాధ్యమ విధానం ద్వారా కలెక్టర్ ఈ రోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన, మారుమూల గ్రామాల్లో అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా ఇబ్బందులను తొలగించడమే లక్ష్యంగా రహదారి ప్రాంతాల అభివృద్ధికి నిధులు మంజూరు చేశామన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులోపు నిర్మాణ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

జాతీయ సముద్రయాన దినోత్సవం -National Maritime Day" ఈ రోజు జరుపుకుంటున్నాం. 1919లో ఏప్రిల్ 5న SS లాయల్టీ' అనే మొదటి భారతీయ వాణిజ్య నౌక ముంబై నుండి లండన్‌కు ప్రయాణించింది. ఈ ముఖ్యమైన సంఘటన అంతర్జాతీయ నౌకా రవాణా రంగంలోకి భారతదేశ ప్రవేశానికి నాంది పలికి దేశ సముద్రయాన ప్రస్థానానికి పునాది వేసింది. ఈ చారిత్రక ఘట్టాన్ని గుర్తుచేసుకుంటూ ప్రతి సంవత్సరం ఏప్రిల్ 5ను జాతీయ సముద్రయాన దినోత్సంగా నిర్వహిస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో సముద్రయాన రంగం పాత్రను, నావికుల సేవలను ఈ రోజున గుర్తు చేసుకుంటూ కార్యక్రమాలు నిర్వహిస్తారు . సముద్రాల చరిత్ర, వారసత్వం, అంతర్జాతీయ వాణిజ్యం, రవాణా, దేశ ఆర్థికాభివృద్ధిలో వాటి పాత్రపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ రోజు నిర్వహణలోని ముఖ్య ఉద్దేశం.

---------------------------

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో కేంద్ర ప్రభుత్వ జలజీవన్ మిషన్ పథకం కింద 103 కోట్ల రూపాయలతో పనులను చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఈ రోజు ప్రకటనలో వెల్లడించారు. ఈ నిధులతో జిల్లాలోని ఆత్మకూరు, గూడూరు, కావలి, కోవూరు, నెల్లూరు గ్రామీణం, సర్వేపల్లి, ఉదయగిరి, వెంకటగిరి శాసనసభ నియోజకవర్గాలలోని వివిధ గ్రామాల్లో తాగునీటి పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. జలజీవన్ పథకం పూర్తి అయితే జిల్లాలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు పరిష్కారమవుతాయని కలెక్టర్ పేర్కొన్నారు.

---------------------------

విశాఖపట్నం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రేపు ప్రజా సమస్యల పరిష్కార వేదిక –పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలను నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాల్లో రెవెన్యూ అధికారులతో పాటు అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను పూర్తి వివరాలతో సమర్పించాలని సూచించారు. అలాగే 'మీ కోసం' కాల్ సెంటర్ 1100 సేవలు, Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌ను వినియోగించుకోవాలని కోరారు. అలాగే ఇప్పటివరకు ఆయా శాఖలకు అందిన ఫిర్యాదులు, తీసుకున్న చర్యలపై సమీక్ష నిర్వహిస్తామని

తెలిపారు.

--------------------------

రాష్ట్రంలో చలన చిత్ర పరిశ్రమ అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు ముందుకొచ్చే వారికి ప్రభుత్వం సహకారం అందిస్తుందని రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ స్పష్టం చేశారు. గుంటూరులో నిర్వహించిన బడ్జెట్ అవుట్ రీచ్ కార్యక్రమం అనంతరం పాత్రికేయులతో ఆయన నిన్న మాట్లాడారు.

======================